ఊపందుకున్న 'ఉపాధి'

● రోజు వారీ కూలి రూ.272కు పెంపు
● పెరిగిన కూలీల సంఖ్య

కోసిగి: జాతీయ గ్రామీణ హామీ పథకం కింద ప్రభుత్వం కల్పిస్తున్న పనులు ఊపందుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పనుల కోసం పట్టణాలకు వెళ్లకుండా అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తున్నారు. వేసవి కాలం కావడంతో వ్యవసాయ పనులు లేక పోవడంతో ఉపాధి పనులకు రోజు వారీగా గ్రామ గ్రామాన వందల సంఖ్యలో కూలీలు హాజరవుతున్నారు.

ముమ్మరంగా పనులు

మంత్రాలయం నియోజకవర్గంలో కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం మండలాలలోని అన్నీ గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఫారం పాండ్స్, డగ్ అవుట్స్, పూడికతీత, కాల్వ గట్లు, ముళ్ల పొదలు తొలగింపు తదితర పనులు చేపడుతున్నారు.

కూలి పెంపుతో పనులపై ఆసక్తి

ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు రోజువారీ వేతనం రూ.272 పెంచారు. ఈ మేరకు కూలి గిట్టుబాటు అయ్యేలా కొలతలు వేస్తూ అధికారులు పనులు చూపుతున్నారు. కోసిగి మండలంలో 2,69,000 పనిదినాలు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. కూలీ పెంచడంతో మండలంలోని పనుల కోసం ఇతర పట్టణాలకు వెళ్లకుండా గ్రామంలోనే ఉంటూ ఉపాధి పనులు చేసుకుంటున్నారు.



కోసిగిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండలాల వారీగా కూలీల వివరాలు

మండలం	పంచాయతీలు	కూలీలసంఖ్య
కోసిగి	24	4,779
మంత్రాలయం	20	4,027
కౌతాళం	30	4,309
పెద్దకడబూరు	20	4,853
మొత్తం	94	1,7968

గ్రామసభలతో ప్రజల్లో చైతన్యం

కోసిగి మండలంలో ప్రతి గ్రామంలో గ్రామ సర్పంచ్లు, ఫీల్డు అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్‌లతో కలిసి గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి వలసలు వెళ్లకుండా ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు. అధిక సంపాదన కోసం వలసలు వెళ్లి బడిలో చదువకునే పిల్లల జీవితాలను నాశనం చేయకూడదని అవగాహన కల్పిస్తున్నారు. పిల్లల భవిషత్ లక్ష్యంగా బడులకు పంపించి ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు చూపుతున్నారు. జాబ్ కార్డు లేని వారికి కార్డు మంజూరు చేసి మరీ పనులు కల్పిస్తున్నారు.

వేతనం పెంచడం సంతోషంగా ఉంది



గ్రామంలో వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులకు వెళ్తున్నాను. పనుల కోసం ఎప్పుడు ఇతర పట్టణాలకు వెళ్లలేదు. ప్రతి ఏటా భార్యతో కలిసి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. కూలీ వేతనం రూ.272 పెంచడం సంతోషంగా ఉంది. – హనుమంతు, పల్లెపాడు

గ్రామంలో ఉపాధి పనులు చేసుకుంటున్నాం



వర్ష కాలంలో మాత్రమే మా గ్రామంలో వ్యవసాయ పనులు ఉంటున్నాయి.మిగిలిన రోజుల్లో ఉపాధి పనులు చేసుకుంటున్నాం. పూడికతీత, ఫారంపాండ్, కాల్వ గట్టు పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం వేసవి కావడం ఉదయం వెళ్లి 11గంటలోపు పనులు చేసుకుని వస్తున్నాం. పెండింగ్‌లో లేకుండా వేతనం చెల్లిస్తున్నారు. – వెంకటేష్, పల్లెపాడు

అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తున్నాం



కోసిగి మండలంలో కూలీలు పనుల కోసం ఇత ర పట్టణాలకు వెళ్లకుండా గ్రామంలోనే అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తున్నాం. గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరుస్తున్నాం. వారం వారం కూలీలు పనిచేసిన దినాలకు కూలీల డబ్బులు నేరుగా ఖాతాల్లో జమ చేస్తున్నాం. వేతనాలు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. – జయరాం, ఏపీఓ

క్లుప్తంగా

విద్యుత్ వాడకాన్ని తగ్గిద్దాం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించి, ప్రజలపై భారం పడకుండా చూద్దామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి అన్నారు. విద్యుత్ వినియోగంపై గురువారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో ఎంఈ నాగభూషణంరెడ్డి, డీఈలు, ఏఈలు, వార్డు సచివాలయాల ఎమినిటీస్ సెక్రటరీలు, లైన్‌మెన్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో నెలకు దాదాపు రూ.50 లక్షల మేర విద్యుత్ బిల్లులు చెల్లించడం జరుగుతుందని, తద్వారా ప్రజలపై భారం పడుతోందన్నారు. విద్యుత్ వాడకాన్ని తగ్గించి, అవసరమైన మేరకు వినియోగిస్తూ నీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ చేయాలన్నారు. వీధిలైట్లు నిర్వహణలో కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వీడాలన్నారు. ఉదయం, సాయంత్రం వీధిలైట్లు వేయడం, ఆర్పడం వల్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. వీధిలైట్లకు ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పాలిసెట్ విద్యార్థులకు ఉచిత కోచింగ్

ఆదోని రూరల్: స్థానిక నేషనల్ ఇంగ్లిష్ స్కూల్‌లో మే 1 నుంచి 6వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాలిసెట్ రాసే విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు భీమా ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు గురువారం తెలిపారు. విద్యార్థులు పాలిసెట్‌లో రాణించేలా శిక్షణలో మెలకువలు నేర్పడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 76600 11180, 94901 94336 నంబర్లను సంప్రదించాలన్నారు.

కులవృత్తులను గౌరవిద్దాం



దీక్షలో కూర్చున్న వారికి మద్దతు తెలుపుతున్న నాయకులు

ఆదోని రూరల్: నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి రెండో రోజు గురువారం ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరినాయుడు ఆధ్వర్యంలో ఫెడరేషన్ నాయకులు సంఘీభావం తెలిపారు. కులవృత్తిదారులకు అన్నివేళలా బీసీ ఫెడరేషన్ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ముందుగా దీక్షలో కూర్చొన్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులకు పూలమాలలు వేసి మద్దతు ప్రకటించారు. దస్తగిరినాయుడు మాట్లాడుతూ.. సమాజంలో కులవృత్తిదారులైన చాకలి, మంగళి తదితర వృత్తుల వారిని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో తాలూకా గౌరవ సలహాదారులు దేవిశెట్టి ప్రకాష్, బి.రాముడు, బి.మల్లేశ్వరప్ప, కపటి వీరభద్ర, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దపెండేకల్ గ్రామశివారులోని బైచిగేరి క్రాస్ వద్ద ఆస్పరి మండలం పలకూరబండ గ్రామానికి చెందిన గొల్ల క్రిష్టన్న గురువారం మోటార్‌సైకిల్‌పై అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తాలూకా ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. సమాచారం మేరకు తమ సిబ్బంది దాడులు చేసి సదరు వ్యక్తిని పట్టుకోవడం జరిగిందన్నారు. అతని వద్ద నుంచి మోటార్‌సైకిల్,96 ఒరిజినల్ చాయిస్ డీలక్స్‌విస్కీ(90ఎం.ఎల్)కర్ణాటకమద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఖగ్గల్‌లో ప్రతిష్ఠోత్సవాలు

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని ఖగ్గల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయస్వామి, రామలక్ష్మణుడు, నవగ్రహాలు, గణపతి, నాగప్ప విగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ నేతలు వై.సీతారామిరెడ్డి, వై.ప్రదీప్‌రెడ్డి గ్రామానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వాదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, కోసిగి మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాబిరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత కంటి పరీక్షలు

కౌతాళం: మండల పరిధిలోని బాపురం గ్రామంలో శుక్రవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ శిల్పా రెడ్డి, గ్రామ నాయకుడు గురునాథ్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో కర్నూలు అమీలియా ఆసుపత్రి వారు వైద్య శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. కంటి పరీక్షలతో పాటు మూల వ్యాధికి సంబంధించిన పరీక్షల్ని చేస్తారన్నారు. బాపురం గ్రామంతో పాటు డంబలదిన్నె, వీరాలదిన్నె గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని కర్నూలుకు రెఫర్ చేస్తారని చెప్పారు.

లోకేష్‌ది అబద్ధాల యాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఆదోని టౌన్ : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర అబద్ధాల యాత్ర అని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నబాబు చేపట్టిన యువగళం అబద్ధాల గళం అని విమర్శించారు. యాత్ర పేరుతో తిరుగుతూ ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులను టార్గెట్ చేస్తూ ప్రసంగాలు చేయడం, పార్టీ కార్యకర్తలతో చప్పట్లు కొట్టించుకుంటూ ప్రజాభిమానం ఉన్నట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. చిన్నబాబు మీ నాన్న చంద్రబాబునాయుడు వెనుక పెద్ద దొంగలముఠా ఉందన్న విషయం తెలుసుకుని ఇతరులపై ఆరోపణలు చేయాలని సూచించారు. గతంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో మద్యం ధరలు తక్కువగా ఉన్నప్పటికీ ఎక్కువ ధరలకు అమ్మి పబ్బం గడుపుకున్న సంఘటనలు మరిచారా? అని ప్రశ్నించారు. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో పర్యటిస్తున్న నారా లోకేష్ ఎమ్మెల్యేలపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. 2004కు ముందు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లో 300 ఎకరాల భూమిని ఎకరా రూ.50 వేలు చొప్పున కొనుగోలు చేసి కోట్లాది రూపాయలను గడించారని గుర్తుచేశారు. విజయవాడలోని కరకట్టు ఏరియాలో నిబంధనలను ఉల్లంఘించి ఇల్లు నిర్మించుకోవడం భూదందా కాదా అంటూ ప్రశ్నించారు. సీఆర్‌డీఏ పేరుతో వేల ఎకరాలు కబ్జా చేయలేదా అంటూ విమర్శించారు. సమావేశంలో పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ మహ్మద్‌స్వామి పాల్గొన్నారు.

'వైఎస్సార్ యంత్రసేవ' రైతులకు వరం



ట్రాక్టర్‌ను పంపిణీ చేస్తున్న వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం రూరల్: వైఎస్సార్ యంత్ర సేవ పథకం రైతులకు వరమని వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో మంచాల–2 ఆర్బీకేకు మంజూరైన ట్రాక్టర్‌ను రైతులు బసవరాజు, రాఘవేంద్రకు అందజేశారు. అనంతరం వై.సీతారామిరెడ్డి ట్రాక్టర్‌ను నడిపి రైతులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఏవో జీరా గణేష్, ఏఈఓ నరసింహ తదితరులు ఉన్నారు.

ఇంటర్‌లో 'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ



రాధాలక్ష్మి (952) జయలక్ష్మి (926) దేవిశ్రీ (919)

పెద్దకడబూరు: ఇంటర్ ఫలితాలలో పెద్దకడబూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 83 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 37మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 44.58 శాతం సాధించారు. అందులో 470 మార్కులకు 432 మార్కులతో మల్లికార్జున టాపర్‌గా నిలిచాడు. 430తో గీతాంజలి రెండో స్థానం, 425తో శ్రావణి మూడోస్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో 52మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 52 శాతంతో 27మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వారిలో 893తో ఏ.వినిత టాపర్‌గా, 822తో టి.వింధ్య రెండో స్థానంలో నిలిచింది.

తగ్గిన ఉత్తీర్ణత

కోసిగి: కోసిగి మండలంలోని ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పూర్తిగా తగ్గింది. కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 172 మంది విద్యార్థులకు గానూ 27 పాస్ కాగా 16 శాతం, ద్వితీయ సంవత్సరంలో 186 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 32 పాస్ అయి 17శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో సంధ్య బైపీసీలో 876 మార్కులు, లలిత ఎంపీసీలో 873 మార్కులు, నరసింహులు హెచ్ఈసీలో 734 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. కోసిగి ఏపీ మోడల్ స్కూల్‌లో ఫస్ట్ ఇయర్‌లో 43 మందికి గానూ 22 మంది పాస్ 51 శాతం, సెకెండియర్‌లో 68మందికి గానూ 36 మంది పాస్ 53శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. ఇందులో మానస బైపీసీలో 928 ఎ జానకి ఎంపీసీలో 912 మార్కులతో ప్రథమ స్థానం నిలిచారు. ఫస్ట్ ఇయర్‌లో బైపీసీలో అక్షిత 379 , ఎంపీసీలో సుశీల 372 మార్కులు సాధించారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో 25 మందికి గానూ 21 పాస్ కాగా 84శాతం, ఫస్ట్ ఇయర్‌లో 21 మందికి గానూ 7 మంది పాస్ కాగా 33 శాతం ఉత్తీర్ణ సాధించారు. పీహెచ్‌పీటీ రాధలక్ష్మి 952 మార్కులు, ఫస్ట్ ఇయర్‌లో మహా లక్ష్మీ 468 మార్కులు సాధించారు.

మంత్రాలయంరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 100 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 10 మంది మాత్రమే పాసయ్యారు. రెండో సంవత్సరంలో 230 మందికి గాను 39 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో సింధు బైపీసీ 848, యువరాజు బైపీసీ 754 మార్కులు సాధించారు.

● మండల పరిధిలోని చిలకలడోణ గ్రామ శివారులో ఉన్న కేజీబీవీ పాఠశాలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 35 మంది గాను 20 మంది పాసయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 38 మంది గాను 32 మంది పాసయ్యారు. వీరిలో జయలక్ష్మి: 926, దేవిశ్రీ:919 మార్కులు సాధించి టాపర్ గా నిలిచారు.

● మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామ శివారులోని మోడల్‌స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం:85 మందికి గాను 8 మందికి పాస్ అయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 71 మందికి గాను 35 మంది పాస్ అయ్యారు. మేకల నందిని ఎంపీసీ 879 మార్కులు సాధించిన టాపర్ గా నిలిచింది.

30శాతం ఉత్తీర్ణత

కౌతాళం: ఇంటర్ పరీక్షల్లో కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 30.66శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో కేవలం 10శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. కళాశాలలో బైపీసీ గ్రూప్‌లో కాత్రికి గ్రామానికి చెందిన తేజ్‌పాల్ 861మార్కులు, సీఈసీలో రాధమ్మకు 860, ఎంపీసీలో రవీంద్ర 802 మార్కులు సాధించారని చెప్పారు. మొదటి సంవత్సరంలో బైపీసీలో సుస్మిత 440కి గాను 313 మార్కుల సాధించిందని, అలాగే ఎంపీసీ గ్రూపులో కృష్ణవేణి 470 మార్కులకు గాను 313 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.

మెరిసిన ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులు

ఆదోని రూరల్ : ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో చదువుతున్న పెద్దహరివాణంకు చెందిన ఎస్.కాళింగ అనే విద్యార్థి ఇంటర్మీడియెట్ ఎంపీసీ పరీక్షా ఫలితాల్లో 983 మార్కులు సాధించాడు. హాస్టల్ వార్డెన్ ఎస్.విశ్వనాథరెడ్డి మంచి మార్కులు సాధించిన విద్యార్థిని అభినందించాడు. మున్ముందు పై చదువులకు తగినంత ఆర్థిక సాయం అందజేస్తానని భరోసా ఇచ్చారు. అలాగే హాస్టల్‌కు చెందిన విద్యార్థులు జి.సింహాద్రి సీఈసీలో 893 మార్కులు, ఎస్.కార్తీక్ ఎంపీసీలో 873 మార్కులు సాధించినట్లు చెప్పారు.



కాళింగ (983)ను అభినందిస్తున్న వార్డెన్ విశ్వనాథరెడ్డి

ప్రజలు జగనన్న ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారు

● ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
● బలాదూర్, సంతెకూడ్లూరు, ఎడవలి గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



బలాదూర్ గ్రామంలో ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : ప్రజలు మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం నాలుగో రోజు సంతెకూడ్లూరు గ్రామంలో మిగిలిన 30 గడపలను సందర్శించారు. అనంతరం బలాదూరు, ఎడవల్లి గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ప్రతి గడపను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బలాదూర్, ఎడవలి గ్రామాల్లో తాగునీటి పైపులైన్ కనెక్షన్లను మహిళల చేత ప్రారంభించారు. తమ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు లేవని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులను సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం

ఆదోని ప్రజలకు అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే అన్నారు. 90 శాతంకు పైగా ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడం జరిగిందన్నారు. టీడీపీ హయాంలో పథకాలకోసం గంటల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రజలు సమయాన్ని వృథా చేసుకునే వారన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామస్థాయిలో సచివాలయాలు, ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు, అన్నివర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందించడం జరిగిందన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా ప్రజల ఆశీస్సులు ఉన్నంతవరకు ఈ రాష్ట్రానికి జగన్ ముఖ్యమంత్రిగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు మంజుల, రేణుక, ఎంపీపీ బడాయి దానమ్మ, పంపాపతి, గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు

కౌతాళం: ఈదురు గాలులతో కూడిన వర్షం గురువారం సాయంత్రం కురవడంతో కౌతాళం సబ్‌స్టేషన్ నుంచి ఉప్పరహాల్, బదినేహాల్, కుంటనహాల్ గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్‌కు సంబంధించిన స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ లైన్‌లో ఐదు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సిబ్బంది సరఫరాను నిలిపివేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. శుక్రవారం విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి పనుల్ని పూర్తి చేస్తామని ఏఈ నర్సప్ప తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

ఆదోని రూరల్ : కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు అఖండ, మల్లి డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎంసెట్, ఐఐటీ, ఇతర కోచింగ్ పేర్లతో నడుపుతున్న కార్పొరేట్ స్కూళ్లు, జూనియర్ కళాశాలలను సీజ్ చేయాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు రసూల్, రాజు, వీరేష్, అభి తదితరులు పాల్గొన్నారు.

'మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం'

ఆదోని రూరల్/ పెద్దకడబూరు :మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం.. దేశాన్ని కాపాడుకుందామని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం ఆదోని మండలంలోని సంతెకూడ్లూరు, బలాదూరు, ఎడవల్లి, పెద్దహరివాణం, పెద్దకడబూరు మండల పరిధిలోని దొడ్డిమేకల, హెచ్.మురవణి గ్రామాలలో ప్రచారభేరీ చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు, సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, నాయకులు తిక్కన్న, వీరేష్ పాల్గొన్నారు.

ఘనంగా దర్గా ప్రారంభోత్సవం

కోసిగి: మండల పరిధిలోని గొడగల్లు గ్రామంలో మాబు సుభాని దర్గాను కులమతాలకు అతీతంగా ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, ఆయన కుమారుడు ధరణీధర్ రెడ్డి సహకారంతో పునఃనిర్మించారు. గురువారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని గ్రామ సర్పంచ్ శివమ్మ ఆధ్వర్యంలో ప్రజల సమక్షంలో దర్గా వద్ద ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి ప్రారంభించారు. పురాతన దర్గా శిథిలావస్థకు చేరుకోవడంతో పునఃనిర్మించాలని , ఇందుకు సహకారం అందించాలని గ్రామ ప్రజలు యువనేత ధరణీధర్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన రూ.1.20లక్షలతో దర్గా నిర్మించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, ఆర్ల బండ సహకార సంఘం అధ్యక్షుడు మహంతేష్ స్వామి,జంపాపురం బసిరెడ్డి, మల్లికార్జున గౌడ, బుల్లి నరసింహులు, మహాదేవ తదితరులు పాల్గొన్నారు.

మిరప పంటను కాపాడుకోండి

పెద్దకడబూరు : కల్లాల్లో ఆరబోసుకున్న ఎండు మిరప పంటను రైతులు కాపాడుకోవాలని ఏఓ ఎం.వరప్రసాద్ సూచించారు. మండలంలో బుధవారం కురిసిన వర్షానికి తడిసిన మిరప దిగుబడులను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు వాతావరణం ఇలానే మేఘావృతమై ఉంటుందన్నారు. బాగా ఆరిన పంటలు ఏమైనా ఉంటే ఇళ్లకు తరలించుకోవాలని సూచించారు. సరిగా ఆరని పంటలు ఉంటే టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచుకొని వర్షాల నుంచి పంటలను కాపాడుకోవాలన్నారు. దీంతోపాటు మండలంలో ఎక్కడైనా వరిధాన్యం తడిచిపోయినట్లయితే మొలకలు రాకుండా లీటరు నీటికి 5గ్రాముల ఉప్పును కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఇందు, శ్వేత పాల్గొన్నారు.

ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలను సమర్పించి, ప్రార్థనలు జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.

ఉరుకుందలో ముగిసిన టెండర్లు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం వద్ద వివిధ పనులకు గురువారం టెండర్లు ముగిశాయి. ఆన్‌లైన్ టెండర్లతో పాటు బహిరంగ వేలం పాటను, సీల్డ్ టెండర్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజినేయుల సమక్షంలో నిర్వహించారు. ప్రింటింగ్‌కు పిలిచిన టెండరును గురు బృందావన్ గ్రాఫిక్స్ వారు తక్కువ కోడ్ చేసి దక్కించుకున్నారని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. వంట చెరుకు సప్లై కోసం రామాచారి తక్కువ కోడ్ చేసి పాట దక్కించుకున్నాడు. సెల్ఫోన్లు, లగేజీ కొరకు రూ.4,59,410 ఎక్కువ కోడ్ చేసి లక్ష్మి దక్కించుకుందని చెప్పారు. పూలు, పూల దండల సరఫరాకు తక్కువ కోడ్ చేసి రాఘవేంద్ర దక్కించుకున్నాడు. అన్నదానానికి కూరగాయాల సరఫరా హక్కును వన్నప్ప సొంత చేసుకోగా, గోశాలకు వరిగడ్డి, పచ్చిగడ్డి, బెల్లం సప్లైని ఈరమ్మ దక్కించుకుంది. దేవాస్థానంకు సంబంధించిన భూములు కౌలును రామన్నగౌడ్ చాకలి ఉసేని దక్కించుకున్నారు.